విశాలాంధ్ర కృష్ణా జిల్లా

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం సా॥ 6-20
సహారీ : బుధవారం ఉ॥ 04-52

కలెక్టర్ బాషాకు సత్కారం

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో జగనన్న గృహనిర్మాణంలో పురోగతి సాధించినందుకు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను జిల్లా అధికారులు సన్మానించారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి రీఓపెన్ కేసులు 25 వరకు వచ్చాయని, వీటిని తగ్గించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్పందనలో మరియు జగనన్నకు చెబుదాం లాగిన్లో వచ్చే అర్జీలు సమగ్రంగా పరిశీలించి, అర్జీదారులకు సంతృప్తికరంగా పరిష్కరించినప్పుడు రీఓపెన కు అవకాశం ఉండదని ఆ విధంగా పరిష్కరించాలని సూచించారు. జిల్లాల విభజన జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహనిర్మాణ ప్రగతికి సంబంధించి ఇప్పటిదాకా జిల్లాలో 14వేల వరకు గృహనిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 22 వేల గృహాలు బిలో బేస్మెంట్ లెవెల్ స్థాయిలో, 18 వేలు బేస్మెంట్ లెవెల్లో ఉన్నాయని, ఇవి పూర్తి చేయగలిగితే జిల్లా మంచి ప్రగతి సాధించనట్లు అవుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, కెఆర్ ఆర్ సీ డిప్యూటీ కలెక్టర్ బి. శివనారాయణ రెడ్డి, సీపీఓ వై. శ్రీలత, డీఎస్ఓ పార్వతి, డ్వామా పీడీ మరియు హౌసింగ్ పీడీ ఇన్చార్జి జీవీ. సూర్యనారాయణ, డీఆర్డీఏ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, నగరపాలక సంస్థ కమీషనర్ చంద్రయ్య, ఏడీ సర్వే గోపాలరాజులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఫిబ్రవరి 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కృష్ణా యూనివర్సిటీ ఎం.సి.ఏ విద్యార్థి అద్దంకి గణేష్ కుటుంబాన్ని ఆదు కొనుటకై యూనివర్సిటీ సిబ్బంది నుంచి విరాళాలుగా సేకరించిన రూ.1.32 లక్షలు యూనివర్సిటీ వీసీచే విద్యార్థి తల్లి అద్దంకి ధనలక్ష్మి, సోదరి అద్దంకి దుర్గా భవానిలకు అందచేసి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంసీఏ విభాగపు అధ్యాపకులు ప్రొఫెసర్ వై. కె.సుందర కృష్ణా, డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్, డాక్టర్ ఆర్.విజయకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

విశాలాంధ్ర-మచిలీపట్నం : గంజాయి అమ్మే వాళ్లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని ఎస్పీ పి జాషువా అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 5 పోలీస్ స్టేషన్లో, 22 మంది అరెస్ట్, 40 కిలోల గంజాయి, 3 గ్రాములు ఎండి ఎంఏ ఆటో, బైక్, 16 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ప్రత్యక్షంగా లేకపోవడం, వారు ఎవరి స్నేహంలో ఉన్నారో గమనించుకోక పోవడం, చెడు స్నేహాల బారినపడి బంగారు భవిష్యత్తును యువత కాలరాసుకుంటున్నారనీ ఆయన వెల్లడించారు. ఇందులో ఆరుగురు బీటెక్, ఉన్నత విద్య అభ్యసించిన వారు, నలుగురు ఐటిఐ , ఇద్దరు డిగ్రీ పూర్తి చేసిన వారు ఉండడం చాలా బాధాకరం అన్నారు. వీరంతా వీరి ఫోన్లో ఉన్న ఆండ్రాయిడ్ యాప్స్ ద్వారా సామాజిక మాధ్యమాల వేదికగా ఒకరితో ఒకరు పరిచయాలు ఏర్పాటు చేసుకుని అక్రమ రవాణా వినియోగం వికారాలు నిర్వహిస్తున్నారు. వీర్లు రాష్ట్రవ్యాప్తంగా గంజాయి సరఫరా చేస్తున్న లోవరాజును ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో చాకచక్యంగా పట్టుకున్నారు. గంజాయి మొక్కల సంబంధించిన నిబంధనలు ఉల్లంగిస్తే వారిపై 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుంది. ఇలా చిన్నచిన్న క్షణికానందాలకు పోయి కేసుల పాలు కావద్దని, ఎన్నిసార్లు కేసులు నమోదైనప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాకుంటే, వారిపై పిడియాక్ట్‌ను అమలు పరిచేలా కఠిన చర్యలకు ఉపక్రమించాల్సి వస్తుందని, కనుక సన్మార్గంలో నడవాల్సిన యువత పెడత్రోవ పడితే పరిణామాలు చాలా తీవ్రతరంగా ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. అంతేకాక ఈ కేసులో ఉన్న వారందరిని విచారణ జరిపి దీని మూలాలు ఎక్కడ ఉన్న వాటిని తేల్చితం గంజాయికి సంబంధించిన ఏ చిన్న సమాచారం ఉన్న నేరుగా తెలియజేయవచ్చు తెలిపిన వారి యొక్క వివరాలు గోపియంగా ఉంచబడతాయి అలాగే వీరందర్ని అదుపులోనికి తీసుకోవడానికి ప్రత్యేకంగా కృషిచేసిన ప్రతి ఒక్క పోలీస్ అధికారికి సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యం

విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : అంతరాయం లేని విద్యుత్ సరఫరాను నిరంతరం ప్రజలకు అందించడం ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ, సైన్స్ టెక్నాలజీ, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి శ్రీనివాస్ నగర్‌లో 33/11కేవీ సామర్థ్యంతో రూ.7.4 కోట్లతో నిర్మించిన కంటైనర్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిగా కంటైనర్ విద్యుత్తు సబ్ స్టేషన్‌ను మన రాష్ట్రంలో మన జిల్లాలో ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. రూ.4 కోట్ల 30లక్షలతో కంటైనర్, ఇతర సబ్ స్టేషన్ పనులుతో కలిపి రూ.7 కోట్ల 40 లక్షల వెచ్చించి ఈ కంటైనర్ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించడం జరిగిందన్నారు. స్థలాభావం ఉన్నచోట్ల ఇటువంటి కంటైనర్ సబ్ స్టేషన్ నిర్మించుకోవడం, తక్కువ స్థలం, తక్కువ ఖర్చులో సులభతరం అవుతుందన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సిబ్బంది లేకుండా రిమోట్ లొకేషన్ నుండి పర్యవేక్షించవచ్చన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని చోట కూడా ఈ తరహా సబ్ స్టేషన్ నిర్మించవచ్చని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల గొల్లపూడి ప్రాంతంలోని పంట కాలవ రోడ్డు, వెంకట స్వామి టెంపుల్ రోడ్డు, శ్రీనివాస్‌నగర్, ఎట్ కిన్సన్ స్కూల్ రోడ్డు, సాయిపురం కాలనీల్లో ఇల్లు, వాణిజ్య సర్వీసులు కలిపి 7,745 విద్యుత్ సర్వీసులు అందుబాటులో ఉంటాయాన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీవీకే ప్రసాద్, ఏపీ సీపీడీసీఎల్ చైర్మన్, ఎండీ జే.పద్మజనార్ధనరెడ్డి, విజయవాడ టౌన్ ఆపరేషన్ ఈఈ సుధాకర్ పాల్గొన్నారు.

గంజాయిని అరికట్టండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : మాజీమంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఎండి సలీం పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు పిన్నింటి అయ్యప్ప నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షుడు డొక్కు సాయిలు కలెక్టర్ ఆఫీస్ ముందు గంజాయి డ్రగ్స్ ను తక్షణమే అరికట్టాలని నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం కలెక్టరుకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణ జిల్లా కేంద్రం మచిలీపట్టణంలో గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగం గత కొద్ది పెరుగుతోంది. ముఖ్యంగా నగరంలో పలుచోట్ల గంజాయి విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతున్నాయి. గంజాయి ప్రమాదకర స్థాయిలో సేవిస్తున్న వారిలో బాలురు కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఇది జిల్లా కేంద్రానికి పరిమితం కావడం లేదు. దీంతో ఈ మహమ్మారి బారిన పడే బాధితుల సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతుండడంతో ఆందోళన కలిగిస్తోంది. బందరులోని కొన్ని ప్రాంతాల్లో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలుకంటి తుడుపు చర్యలతో చేతులు దులిపేసుకుంటున్నారు. వెంటనే గంజాయి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ పార్లమెంట్ విద్యార్థి విభాగ కార్యదర్శి మనికుమార్, టౌన్ తెలుగుయువత కార్యదర్శి పోతన రాజ, రూరల్ తెలుగు యువత ఈడే దాస్, గంపల రవితేజ, జింకల వెంకట్, ఏకో, కుమారస్వామి, దినేష్, మాదరు, ఖదీర్, యూసుఫ్, జీకే నాయుడు, మెహర్ సాయి, దుర్గా రావు, భాను, మరియు యువత, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

దళితుల శ్మశానికి స్థలం కేటాయించండి : కంచర్ల

విశాలాంధ్ర-గుడివాడ : దళితుల శ్మశానికి స్థలం కేటాయించాలని, దళితుల ఆధ్వర్యంలో ఎన్ని పోరాటాలు చేసిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకార్ అన్నారు. సోమవారం స్థానిక గుడివాడ రెవిన్యూ డివిజనల్ కార్యాలం వద్ద దళితులకు సమాధులకు స్థలం కేటాయించాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకార్, ఆదిమాంధ్ర జిల్లా అధ్యక్షుడు పొంగలేటి జయసరాజు. దళిత నాయకలు మమిళ్ళ ఏలిషా, బలసాని ఏలిషా, గంధం సైమన్‌బాబు, అత్తాటి సాల్మన్, కమల, రాజు, మణిక్యలరావు, కొడాలి బాబు, యోహన్‌లు మాట్లాడుతూ గుడివాడలోని రైలుపేట, కార్మికనగర్, గుడ్‌మెన్‌పేట, పాముల కాలనీ, నాగన్న చెరువు గట్టు, దొండపాడు కాలనీ ప్రాంతాల్లో నివసిస్తున్న దళిత ప్రజలు గత 120 సంవత్సరాలుగా రైలుపేటలోని స్మశాన వాటికను వాడుతున్నారు. 20 సంవత్సరాలుగా స్మశానంలో స్థలం అంత శవాలతో నిండి పోవడంతో ఒక్కొక్క జాగాలో ఏడు, ఎనిమిది శవాలను పెట్టాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, దళిత నాయకలు పాల్గొన్నారు.

గర్భిణిలు, బాలింతలకు పోషకాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- గర్భిణిలు, బాలింతలు ఎక్కువ శాతం పోషకా హారాన్ని తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలని ఐసిడిఎస్ సూర్‌వైజర్ ఆర్ నాగలక్ష్మి అన్నారు. గర్భిణిలకు, బాలి ంతలకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోషకాహార విలువల పై అవగహన సదస్సును సొమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ముంగింపు కార్యక్రమాన్ని పల్లెకొండవారిమోడీలో ఉన్న అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల ఆటపాటలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలంటే పోషకాహారం కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో, మహిళ పోలీస్, వైద్యసిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

స్పందన మానసిక వికాస కేంద్రానికి రూ.10 వేలు విరాళం

విశాలాంధ్ర-గన్నవరం : హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో స్పందన మానసిక వికాస కేంద్ర నూతన నిర్మాణానికి విజయవాడకు చెందిన సివిల్ ఇంజనీర్ నమల ప్రసాద్ రూ.10 వేలు విరాళం ఇచ్చినట్లు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ విజయవాడకు చెందిన సివిల్ ఇంజనీర్ నమల ప్రసాద్ స్పందన నూతన భవన నిర్మాణానికి సహాయం అందించారు.

వేములమడలో 104 సంచార వైద్యశాలలో వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని వేములమడ గ్రామంలో సోమవారం నిర్వహించిన విలేజ్ హెల్త్ క్లినిక్ లో ఫ్యామిలీ ఫిజీషియన్/104 వైద్య సేవలను నిర్వహించారు. మొవ్వ పీ.హెచ్ .సీ వైద్యు రాలు డాక్టర్ సిహెచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో 60 మంది రోగులకు పరీక్షలను చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ బి విజయ్ కుమార్, ఎం ఎల్ హెచ్ పి అశ్విత, డిఈవో కైలా కోమలి, ఆశా వర్కర్స్ భూలక్ష్మి, విజయకుమారి, డ్రైవర్ రవీంద్ర పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో ఎంజి ఎన్ఆర్ఇజిఎస్ పనులు సోమ వారం నుంచి ప్రారంభమ య్యాయి. మండల ఏపీవో కే .లక్ష్మిరెడ్డి పనులు పరిశీలిం చగా ఎంపీపీ కొండేటి ఇందిర భట్లపెనుమర్రు గ్రామంలో ఈ పనులను లాంచనంగా ప్రారంభించారు. మండలంలో వేములమడ మినహా మిగిలిన 20 గ్రామాలలో 1861 మంది కూలీలు 35 పంటబోదుల తవ్వకాలపనులను నిర్వహించారు. కాగా గతంలో కంటే రోజుకు?.15లు వేతనం పెరగడంతో ఒక్కొక్కరికి?.272 లను కూలిగా చెల్లించనున్నట్లు ఏపీఎం తెలిపారు.

సర్వీస్ రెన్యూవల్ చేయాలని వినతి

విశాలాంధ్ర-విజయవాడ : తమ సర్వీస్‌ను 2023 సంవత్సరానికి రెన్యూవల్ చేయాలని, ఒక్క రోజు విరామంతో 12 నెలలు ఇప్పించాలని రాష్ట్ర కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్సా సత్యనారాయణను ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ అంశంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర నాయకులు బిజె.గాంధీ, జిఎం.దయాకర్, ఆర్.విజయభేరి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సురేష్, కృష్ణాజిల్లా నాయకులు ఎ.నాగేశ్వరరావు, రాంబాబు, రాజా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : రోడ్డు ప్రమాదాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పామర్రు నియోజకవర్గం ఇంచార్జి వర్ల కుమార్ రాజా సోమవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందుచేసి ఆ రహదారి ప్రక్కన్న ఉన్న ప్రజల దీన స్థితి గురించి తెలియచేయడం జరిగింది. ఈ విషయ%శీ%పై జిల్లా కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించి అక్కడే ఉన్న అధికారులకు తొందరగా ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం విజయవాడ జాతీయ రహదారిపై పామర్రు మండలం జుజ్జువరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఇటీవల కాలంలో వందల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిలో 16మంది ఇప్పటికే ఈ యాక్సిడెంట్లు వల్ల చనిపోయారు. జాతీయ రహదారికి ఇరువైపులా ప్రజలు నివసించే ఇళ్లు కూడా ఉన్నాయని కానీ జాతీయ రహదారి నిర్మించేటప్పుడు కనీసం సబ్ వే కూడా నిర్మించలేదని,ప్రస్తుతం ఆ పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు కూడా లేవని ఈ అసౌకర్యం తో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన ఈ విషయాలు గురించి పట్టించుకోవట్లేదని,సరైన చర్యలు తీసుకోవట్లేదని కనీసం ఇకనైనా అక్కడ కావలసిన కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు.అలాగే స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తన స్వలాభం మాత్రమే చూసుకుంటారు తప్ప నియోజకవర్గ ప్రజల కష్టాలు తెలియవని, అయన అక్రమాలకు చెరువులు, భూములు అయ్యిపోయాయి ఇప్పుడు దేవుడిమీద పడ్డారని అందుకు సాక్ష్యం అడ్డడ గ్రామంలో దేవత విగ్రహాన్ని తొలిగించి మరి చెరువులు తవ్వుకుంటున్నారని అదేవిదంగా కైలే అనిల్ చేస్తున్న అక్రమాలను, అన్యాయాలను ప్రజలు చూస్తున్నారని రానున్న ప్రజా క్షేత్రంలో నీకు తప్పకుండ గుణపాఠం చెప్పి తెలుగుదేశం పార్టీ కి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, మచిలీపట్నం కార్యలయ కార్యదర్శి బత్తిన దాస్ రాష్ట్ర బీసీ సెల్ నాయకులు జన్ను శోభన్ బాబు,జుజువరం గ్రామ పార్టీ అధ్యక్షులు జన్ను నాగమురళి,చాట్ల రమేష్,మచిలీపట్నం పార్లమెంటరీ ఎస్. సి సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ,గోరిపర్తి నాగబాబు,వల్లూరు కిరణ్, జుజ్జువరపు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : వేసవికాలంలో నవధాన్యాల విత్తనాలు భూమిలో పంటగా వేయటం వలన భూసారం వృద్ధి చెందుతుందని అలాగే పశువులకు పచ్చ మేతగా ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ అధికారి గంగరాజు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. మండలంలోని ఈదుల మద్దాల గ్రామంలో 32 మంది రైతులకు నవధాన్యాలు విత్తనాలు ఆదివారం పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ జరిగినట్లు ఆ సంస్థ సిబ్బందిలో ఒకరైన శ్రీదేవి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ నవధాన్యాలు పొలములో వేసవి కాలం ఖాళీ గా ఉన్న పొలంలో పంటగా వేయటం వలన భూసారం పె రిగి పోషక విలువలు భూమిలో నిల్వ ఉంటాయని, తదుపరి వరి తదితర పంటలకు పోషకాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ యూనిట్ ఇన్చార్జి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడండి : ఎంపీపీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఎంతైనా ఉందని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరములో సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పంచాయతీ పరిధిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి. సీతామహాలక్ష్మి, తహసిల్దార్ వి. నాగభూషణం, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు తక్షణం పూర్తి చేయండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు తక్షణం పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కృష్ణలంక రాణిగారితోట, రామలింగేశ్వరనగర్, సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతాల్లో కమిషనర౦ సోమవారం పర్యటించారు. పార్కులలో జరుగుతున్న ఆధునికకరణ పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. కనకదుర్గ వారధి ప్రక్కన రాణిగారితోట రిటైనింగ్ వాల్ దగ్గర ఏర్పాటు చేస్తున్న రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కులో జరుగుతున్న రోడ్లు, బేస్మెంట్ పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగంగా నిర్వహించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కృష్ణలంక జాతీయ రహదారి ప్రక్కన ఉన్న అంబేద్కర్ పార్కులో జరుగుతున్న పునరుద్ధరణ పనులు, గ్రీనరీ ఏర్పాటు పనులను పరిశీలించారు. గ్రీనరీ మొక్కలను ఇంకా పెంచాలని, సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్ మీదా వేసే టైల్స్ ను పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలో అదనపు కమీషనర్ కేవీ.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, ఈఈలు ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, వి.చంద్రశేఖర్, ఎస్ఇ నరసింహమూర్తి, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వారణాసి 'ఆమని అతిథి' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : భావ కవితా మహతి వారణాసి వెంకట్రావు రచించిన ఆమని అతిథి పుస్తకం ఆవిష్కృతమైంది. హిందుస్తాని,కర్ణాట సంగీత విద్వాంసులు వివిఎల్ఎన్ 78వ జయంత్యుత్సవాలు మూడు రోజులపాటు ఘంటసాల ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో జరుగుతున్నాయి. మొదటిరోజు సోమవారం సాయంత్రం సంస్కృతాంధ్ర పండితులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ పుస్తకావిష్కరణ చేయగా గ్రంథ పరిచయం సంస్కృతాంధ్ర భాషా కోవిదులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు చేశారు. మల్లియల సుమ సుధను పంచిన వసంత గీతాలాపన. వరుసగా ఆనంద తాండవం, సంధ్యా తాండవం, కలికి తాండవం, విజయ తాండవం,ఊర్ధ్వ తాండవం, ఉమా తాండవం, సంహార తాండవం అంశాలను సురేష్ బాబు, సంతోష్ కుమార్,షేక్ జానీ మియా,విశ్వం సిహెచ్ అబ్రహం,రాజ్ కుమార్, సప్పా శివకుమార్ ల శిష్య బృందం ప్రదర్శించారు. చివరిగా లేఖ్యా భరణి చే నృత్య సుందరి నృత్య రూపకం ప్రదర్శనమైంది. సభా నిర్వహణ వలివేటి వేంకట శివరామకృష్ణమూర్తి చేశారు.

అనారోగ్యంతో వెంకటేశ్వరరావు మృతి



విశాలాంధ్ర-గన్నవరం : ప్రముఖ పిఏ సిఎస్ చైర్మన్ రాజకీయ నాయకులు కాల్ గ్యాస్ వెంకటేశ్వరావు (70) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు కుమార్తె కుమారుడు ఉన్నారు. మండవా అంటే కాల్ గ్యాస్ అధినేత గుర్తుకు మండల వెంకటేశ్వరరావు గన్నవరం ప్రముఖ రాజకీయ నాయకులతో సంబంధాలు సత్సంబంధాలు కలిగి ఉన్న నాయకుడు ఆయన మృతదేహాన్ని గన్నవరం ప్రముఖ రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

వీరంకిలాకు ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి పై విచారణ

విశాలాంధ్ర-పమిడిముక్కల: వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని వైద్యాధికారి డాక్టర్ పద్మజ రోగుల సరైన వైద్యం అందించట్లేదని, వైద్యశాల నిధులు సరిగా జమా ఖర్చుల వివరాలు చెప్పటం లేదని వైకాపా నాయకుడు మారపాక మహేష్ వైద్య శాఖ కమిషనర్ జె.నివాస్ కి ఫిర్యాదు చేశారు.సోమవారం సదరు విషయం పై లెప్రసి,ఎయిడ్స్ మరియు టి.బి నియంత్రణ అధికారి డా,, ఎ.వెంకట్రావు విచారణ అధికారి డాక్టర్ పద్మజ పై విచారణ చేపట్టారు.

పది పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండమండలంలోని పదో తరగతి కామన్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాలలో మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.తాడంకి కపిలేశ్వరపురం పమిడిముక్కల మేడూరు కేంద్రం లలో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

ఎంపీడీఓ కు చిరు సత్కారం

విశాలాంధ్ర-ఉంగుటూరు : అర్హులైన ప్రతి పేదవాడికి ఆ సంక్షేమ ఫలాలు అందించే విధంగా అమలకు కృషిచేస్తున్న ఉంగుటూరు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్ వి శేషగిరిరావు సీఎం గుర్తించి ఆదివారం ముక్కపాడులో సచివాలయం కన్వీనర్లు, మొక్కపాడు వైసీపీ కన్వీనర్ సీతారామరాజు మన్నే సునీత లబ్ధిదారులు సత్కారం చేశారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ పి.రంజిత్ భాషాకు పలువురు గ్రామ ప్రముకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మచిలీపట్నంలో జరిగిన స్పందన కార్యక్రమంలో లక్ష్మీపురం టీడీపీ నేత చెందిన తొట్టెంపూడి పెదబాబు కలెక్టర్కు అర్జీ సమర్పించారు. గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగం అయినట్లు డీఎల్పీవో నివేదిక సమర్పించారనీ, ఆ నివేదిక ఆధారంగా డీపీవో సర్పంచు షోకాజ్ నోటీసు జారీచేసి నెలలు గడుస్తున్నా చర్యలు తీసుకోలేదని తెలిపారు. పంచాయతీ మినిట్బుక్ ట్యాంపరింగ్ జరిగిందనీ, పంచాయతీలో మరింతగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణలపై విచారణ నిర్వహించి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పెదబాబుతోపాటు మాజీ వార్డుసభ్యులు, స్థానికులు సంతకాలు చేసిన వినతిపత్రాన్ని కలెక్టరుకు అందించారు.

మెరిట్ విద్యార్థులకు రూ.50 ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పెడన : పదవ తరగతిలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో మెరిట్ పొందిన విద్యార్థులకు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఉప్పాల రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు విద్యార్థులకు అందించనున్నట్లు రాంప్రసాద్ తెలిపారు. పదవ తరగతిలో జిల్లా స్థాయిలో మెరిట్ సాధించిన దివ్యాంగులకు తాను ఆర్థిక సహకారం అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి విజయం సాధించాలని రాంప్రసాద్ ఆకాంక్షించారు.

హాఫ్ డే స్కూల్స్ ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : ప్రభుత్వ, ప్రైవేట్. పాఠశాలలలోసోమవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమైనాయి. పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నకేంద్రాలు కూచిపూడి, పెదసనగల్లు, నిడుమోలు, కాజ, కోసూరు, మొవ్వ హైస్కూల్స్ మినహాయించి మిగిలిన 64 పాఠశాలల్లో నిర్వహించిన ఈ తరగతులకు 5000 మందికి పైగా పిల్లలు హాజరైనారు. మధ్యాహ్న భోజనాలు తిన్న తర్వాత పిల్లలు ఇండ్లకు వెళ్లిపోయారు.

పేకాట, కోడి పందాలపై దాడులు.

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని అయ్యంకి, పెదసనగల్లు, బార్లపూడి గ్రామాలలో ఎస్ఐ డి సందీప్ ఆధ్వర్యంలో కోడిపందాలు, పేకాట లపై నిర్వహించిన దాడులలో పదిమంది జూదరులు, మూడు కోళ్లు, రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో మూడవ సెగ్మెంట్లో 90మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణపు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడి పాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నానిలు పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, టీడీపీ నేతలు మోర్ల ప్రసాద్, వేముల హరికృష్ణ, రావులపల్లి పండు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

విశాలాంధ్ర-వీరులపాడు: అక్రమంగా ఇసుకను తరలిస్తూ శనివారం అర్ధరాత్రి వెల్లంకి గ్రామంలో నాలుగు ట్రాక్టర్లు పట్టుబడగా, పట్టుబడిన ట్రాక్టర్లను ఎస్సై సోమేశ్వరరావు మండల తహశీల్దార్ ఆశయ్య కు స్వాధీనపరచగా, ఒక్కొక్క ట్రాక్టర్ కు ఐదు వేల రూపాయల జరిమానా విధించినట్లు తహశీల్దార్ తెలిపారు.

10 పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్.పరీక్షలు పటిష్టమైన పోలీసు బందోబస్తు నడుమ ప్రారంభమైనాయి. గత ఏడాది పరీక్షలలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పరీక్షా కేంద్రంకు ఇద్దరు సచివాలయ మహిళా పోలీసులు, ముగ్గురు పోలీస్ కానిస్టేబుల్స్.ను నియమించారు. కూచిపూడి ఎస్ఐ డి సందీప్ కేంద్రాలను పరిశీలించి అధికారుల నుంచి సమాచారం సేకరించారు.. కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో(ఓ ఎస్ ఎస్ సి) 65 మందికి 65 మంది హాజరైనట్లు సీఎస్ కే శిరీష, డివో వై రాధాకృష్ణ తెలిపారు. కాజ హైస్కూల్లో 61 మంది, కోసూరు(ఓ ఎస్ ఎస్ సి)లో 89 మంది, పెడసనగల్లులో77 మంది, పరీక్షలుకు హాజరైనారు. మొవ్వ"ఏ"సెంటర్లో 128 మందికి ఇద్దరు బాలురు, మొవ్వ"బి"(ఒకేషనల్) సెంటర్లో 113 మందికి ఇద్దరు బాలురు, నిడుమోలు సెంటర్లో 52 మంది విద్యార్థులకు ఒక బాలుడు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఎస్ శివశంకరరావు పేర్కొన్నారు.

గుడివాడలో...

నియోజకవర్గంలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు 13 సెంటర్లులో పరిక్షలు నిర్వహించడం జరిగింది. నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు. చేరుకున్నారు. ఏట్టువంటి అవాంఛనీయ సమస్యలు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు చర్యలు తీసుకుని, పోలీసులను ఏర్పాటు చేశారు.

పెదపారుపూడిలో...

మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తలమర్రు, వెంట్రప్రగడ పాఠశాలలలో పరీక్ష రాసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, మండలంలో మొత్తంగా 242 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బొడ్డు శ్రీనివాస్ సోమవారం తెలిపారు.

వీరులపాడులో...

మండలంలోని పదవ తరగతి పరీక్షలు సోమ వారం ప్రశాంతంగా ప్రారం భమయ్యాయి. వీరులపాడు మండలంలో వీరులపాడు, జయంతి, అల్లూరు గ్రామాల పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ, భద్రత ఏర్పాట్లను అల్లూరు గ్రామ పరీక్ష కేంద్రాన్ని డిసిపి మోకా సత్తిబాబు నందిగామ రూరల్ సి ఐ నాగేంద్ర కుమార్ తో కలిసి సందర్శించారు. మండలంలో 493 విద్యార్థులకు గా 18 గైర్హాజరు అవ్వగా 475 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జయంతి గ్రామ పాఠశాల పరీక్ష కేంద్రానికి పూర్తి శాతంతో హాజరవ్వగా, వీర్లపాడు గ్రామ పాఠశాల పరీక్ష కేంద్రానికి 138 మందికి 131 మంది విద్యార్థులు హాజరయ్యారు, అల్లూరు పరీక్షా కేంద్రానికి 271 మంది విద్యార్థులకు 260 మంది హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన డీసీపీ సత్తిబాబు

విశాలాంధ్ర-కంచికచర్ల : మండలంలోని పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని డిసిపి మెకా సత్తి బాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఇద్దరు పోలీసులు ఇద్దరు మహిళ పోలీసులను నియ మించామన్నారు.,ప్రశాంత వాతా వరణంలో పరీక్షలు నిర్వ హించేందు కు పోలీసు వారి తరుపున అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కంచికచర్ల ఎస్సై సుబ్రహ్మణ్యం డిసిపి వెంట పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

ఊసరవెల్లి వెలంపల్లి...
కమ్యూనిస్టు నేతలను విమర్శించే స్థాయి నీదికాదు

ప్రజాసమస్యలపై పోరాడేవారిపై అవాకులు చెవాకులు పేలితే తగిన బుద్ధి చెపుతాం
సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ : 2014 ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని హామి ఇచ్చి రుణమాఫీ చేయకపోయినా ప్రశ్నించిన కమ్యూనిస్టులు ఇప్పుడు ప్యాకేజీలు తీసుకుని వైసీపీపై విమర్శలు చేస్తున్నారని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ విమర్శించటాన్ని సీపీఐ నగర సమితి తీవ్రంగా ఖండిరచింది. ఈ మేరకు విజయవాడ దాసరి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఊసరవెల్లిలా వ్యవహరించే వెలంపల్లి ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ ఎంతో ఘన చరిత్ర కలిగిన కమ్యూనిస్టు నేతలను విమర్శిస్తే సహించేది లేదని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. నిబద్ధతతో ప్రజల కోసం పని చేసే సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణలను విమర్శించే స్థాయి పూటకోక పార్టీలు మార్చే వెలంపల్లికి లేదన్నారు. వైసీపీ ప్రతిపక్షంగా ఉన్నప్పు సీపీఐ అనేక పోరాటాలు చేసిందన్నారు. వైసీపీ నాయకులు కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో కలిసి పని చేశారని ఇప్పటికీ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పోలీసు కేసుల విచారణకు తమతో పాటు హాజరవుతున్నారని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు వెలంపల్లి ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. ఊసరవెల్లిగా వ్యవహరించే ఆయన అప్పటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ నిలదీయలేదన్నారు. రాజకీయాల్లో వచ్చి పుష్కరకాలం కూడా లేని ఆయన 2009లో ప్యాకేజీ ఇచ్చి ప్రజారాజ్యం పార్టీలో ఎమ్మెల్యే సీటు సంపాదించావని ఆరోపించారు. 2011లో కాంగ్రెస్‌లో చేరారని గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా ఆయా పార్టీలు వారి అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తాయని 2014 ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వెలంపల్లి శ్రీనివాస్ పేరు ప్రకటించటం జరిగిందన్నారు. అధికారం కోసం ఎంత నీచానికైనా దిగజారే సంస్కృతి కలిగిన వెలంపల్లికి కమ్యూనిస్టు నాయకులను విమర్శించే అర్హత లేదన్నారు. ఎమ్మెల్యే అవ్వాలనే కోరికతో బీజేపీ నుంచి వైసీపీలోకి వచ్చారని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయించిన ఘన చరిత్ర సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణకు ఉందన్నారు. ప్రజాప్రతినిధి కాకపోయినా నిత్యం ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తారని చెప్పారు. వెలంపల్లి వయసు కంటే నారాయణ రాజకీయ అనుభవమే ఎక్కువ అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విద్యార్థి నాయకుడుగా ఉన్నప్పుడు శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నుంచి పోటీ చేసి అప్పుడు విద్యార్థి నాయకుడుగా ఉన్న మాజీ పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డిపై విజయం సాధించారని గుర్తు చేశారు. సీపీఐ జాతీయ, రాష్ట్ర నేతలపై విమర్శలు చేసి పశ్చిమ నియోజవర్గ చరిత్రను వెలంపల్లి దిగజార్చారని మండిపడ్డారు. తమ్మిన పోతరాజు, ఉప్పలపాటి రామచంద్రరాజు లాంటి నాయకులు పదవులు ఉన్నా, లేకపోయినా ప్రజలతోనే ఉన్నారని చెప్పారు. అలాగే మరుపిళ్ళ చిట్టి, పోతిన చిన్నా వంటి కాంగ్రెస్ నేతలు పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేశారని పదవులతో పని లేకుండా ఒకే పార్టీలో చివరి వరకు కొనసాగారని తెలిపారు. పుష్కర కాలంలో నాలుగు పార్టీలు మారిన వెలంపల్లి శ్రీనివాస్‌కు 2024లో వైసీపీ నుంచి ఎమ్మెల్యే సీటు రాదని ఆ పార్టీ నాయకులే చెపుతున్నారని, ఒకవేళ సీటు ఇచ్చినా అసమ్మతి సెగలతో ఓటమి తప్పదన్నారు. స్వప్రయోజనాల కోసం, అధికారంతో పబ్బం గడుపుకోవటం కోసం జెండాలు, దండలు మార్చే వెలంపల్లి హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. కమ్యూనిస్టు పార్టీని, నాయకులను విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. మరోసారి కమ్యూనిస్టు పార్టీపై విమర్శలు చేస్తే భవిష్యత్తులో తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు.

సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాటాలు చేసే కమ్యూనిస్టు పార్టీ నాయకుపై వ్యక్తిగతంగా విమర్శిస్తే సహించేది లేదని ఖబడ్దార్...వెలంపల్లి అని హెచ్చరించారు. పేదల కోసం, కార్మికులు, కర్షకుల కోసం పోరాటాలు చేసే చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. సొంత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజాప్రతినిధిగా నిజాయితీగా మాట్లాడాలని, హుందా తనంగా వ్యవహరించాలని వెలంపల్లికి సూచించారు.

పేదలకు సాగుహక్కు పట్టాలు పంపిణీ చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణయ్య

విశాలాంధ్ర-తిరువూరు: సెంటు భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ చేయాలని, పేదల సాగులో ఉన్న భూములకు సాగుహక్కు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అక్కపాలెం గ్రామ సచివాలయం వద్ద సీపీఐ, అనుబంధ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీ పథకం కింద నిర్మిస్తున్న పక్కా ఇళ్లకు రూ.5లక్షల నిధులు మంజూరు చేయాలని, ఇనుము, ఇసుక, సిమెంట్, కంకర వంటి గృహ నిర్మాణ సామాగ్రి ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. 90 శాతం పూర్తయిన టిడ్కో గృహ సముదాయాలలో సైతం మౌలిక వసతులు కల్పించి, లబ్దిదారులకు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. తిరువూరు మండలం అక్కపాలెం పెద్ద చెరువు సమీపంలో 30 సంవత్సరాలుగా పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములకు కూడా వెంటనే సాగుహక్కు కల్పిస్తూ, పట్టాలు పంపిణీ చేయాలని కూడా కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, పార్టీ తిరువూరు మండల కార్యదర్శి నృసింహాద్రి వనమాలి, ఏఐటీయుసీ నియోజకవర్గ ఉపధ్యక్షుడు ఎస్ కే నాగుల్ మీరా (కార్పెంటర్) తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షలు ఇవ్వండి, లేదా పక్కా గృహాలు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వండి

సీపీఐ మండల కార్యదర్శి మేకల దేవిడ్.డిమాండ్

విశాలాంధ్ర-ఎ. కొండూరు : జగనన్న ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోవని, దాన్ని రూ. 5 లక్షలకు పెంచాలనీ లేకుంటే ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మేకల దేవిడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీమలపాడు సచివాలయం వద్ద సోమవారం సీపీఐ మండల కమిటీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మేకల దేవిడ్ పాల్గొని మాట్లాడుతూ కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులు నేటి ప్రభుత్వం ఎందుకు అమలు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదరికం పోవాలంటే భూ పంపిణీ జరగాలని అందుకు నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా భూ పంపిణీని చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గతంలో ఎన్నో సార్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చిందని ప్రభుత్వం సంఘం మాటలు పెడచేవిన పెట్టిందని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, కోనేరు రంగారావు భూ కమిటీ సిపారసులు అమలుచేసి పేదలకు భూమి పంచి పేదరికాన్ని రూపుమాపాలని అయన కోరారు. గ్రామీణ నిరుపేదలు ప్రభుత్వ, బంజర భూములు, అలాగే ప్రభుత్వ మిగులు భూములు, అటవీ బంజరు భూములు సాగుచేసుకొని తమ కుటుంబాలను పోషించుకొనుచున్నారని, పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని అయన కోరారు. అలాగే జగనన్న పేరుతో ఇంటి నివేశన స్థలాలు ఇచ్చారని ఆ స్థలాలలో పక్కా గృహాలు నిర్మించాలంటే ప్రభుత్వం ఇప్పుడిస్తున్న రూ.1.80 లక్షలు పెరిగిన ధరలతో పోల్చుకుంటే కనీసం పునాదులు (బెస్మెంట్) వేయటానికి కూడా సరిపోవని పక్కా గృహం పూర్తికావాలంటే కనీసం రూ.5 లక్షల ఇవ్వాలని, లేకపోతే ప్రభుత్వమే గృహాలు నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వాలని లేకుంటే పట్టణ ప్రాంతాలలో గతప్రభుత్వ హయాంలో లబ్ధిదారుని వాటాతో నిర్మించి టిడ్కోఇళ్లకు రోడ్లు కరెంట్.. డ్రైనేజి సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించాలని డేవిడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ.కార్యదర్శి భూక్యా గోపిక్రిష్ణకి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలొ ఎస్‌కె కరీముల్లా, పంబి మోహనరావు, చల్లా సర్వేశ్వరరావు, మేకల మోషే, తేల్లూరి సంగీతరావు, తిరపతిరావు, గోపిరాజు, సీహెచ్ మణికుమార్, ఎమ్.పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌తో ఉపాధ్యాయ, పీఈటీ పోస్టులు భర్తీ చేయాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ : మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ, పీఈటీ పోస్టులు భర్తీ చేయాలి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా డీఎస్సీ నోటిఫికేషన్ రాకపోవడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది బీఈడీ, టీటీసీ చదివిన నిరుద్యోగ యువకులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలయినా ఒక్క డీఎస్సీ ప్రకటన రాకపోవడంతో వయోపరిమితి మించిపోయి నిరుద్యోగులుగా మారిపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ, పీఈటీ పోస్టు లను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నాడు- నేడు పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్న నేపథ్యంలో మెరుగైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయ, పీఈటీ పోస్టులు భర్తీ చేయడం ద్వారానే విద్యార్థులకు నాణ్యమైన మెరుగైన విద్య అందించే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా 50వేల పైగా ఉపాధ్యాయ పోస్టులు ఆంధ్రప్రదేశ్లో ఖాళీగా ఉన్నాయి చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఖాళీలపై స్పష్టత ఇవ్వకుండా గా నిరుద్యోగుల్ని మోసం చేయడం ద్వారా వారు తీవ్రంగా నష్టపోతున్నరని అన్నారు. ప్రభుత్వము అనుకున్న 100% అక్షరాస్యత సాధించాలనే లక్ష్యం నెరవేరాలంటే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, పీఈటీ పోస్టులు భర్తీ చేయడమే ఏకైక మార్గం అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కార కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి కృషి చేయాలని కోరారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ, పీఈటీ పోస్టులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో ఏఐవైఎఫ్ నగర ఇంచార్జీ కార్యదర్శి బెవర శ్రీను, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సాయి కుమార్, నగర్ ఆఫీస్ బేరర్స్ కాళ్ల విజయ్, ఐ.ఆంజనేయులు ఉన్నారు.

విలీన పాఠశాలల్లో పనిచేసిన...
ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర-తిరువూరు: విలీన పాఠశాలల్లో పనిచేసిన అయాలను అనుబంధ పాఠశాలలు, లేదా ఇతర శాఖల కార్యాలయాల్లో నియమిస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ ఎన్టీఆర్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు తిరువూరు నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సంఘ నాయకులు సోమవారం ఆందోళన చేశారు. స్వీపర్ల సంఘం జిల్లా కార్యదర్శి మార్పకట్ల త్యాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, సరైన మార్గదర్శకాలు లేకుండా ప్రభుత్వ పాఠశాలలు విలీనం చేస్తే, పేద మధ్య తరగతి వర్గాల ప్రజల పిల్లలకు విద్య దూరమవుతుందని ఆరోపించారు. మూత పడిన పాఠశాలలో పనిచేసే స్వీపర్లు ఉపాధి కోల్పోయి, రోడ్డున పడే అవకాశం ఉందని విమర్శించారు. మెర్జింగ్ స్కూల్స్ లో పనిచేసిన ఆయాలను వెంటనే వేరే పాఠశాలలకు బదిలీ చేసి ఉపాధి కల్పించాలని, వివిధ కారణాలతో స్వీపర్లపై రాజకీయ నాయకుల వేధింపులు వెంటనే నిలిపివేయాలని త్యాగరాజు డిమాండ్ చేశారు. ఆయాలకి కూడా ఏకరూప దుస్తులు అందించాలని, మరుగు దొడ్లు లలో వాడే ఫినాయిల్ వగైరాలు సకాలంలో అందించాలని. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ప్రతి నెలా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి సుందరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, ఆయాల సంఘం నియోజకవర్గ కార్యదర్శి బొప్పిలక్ష్మి, మరియమ్మ, విజయలక్ష్మి. తదితరులు పాల్గొన్నారు.

20లోగా మిల్లర్లు బియ్యం అప్పగించాలి : జేసీ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యానికి రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం(కస్టమ్ మిల్లింగ్ రైస్ సీఎంఆర్) ప్రక్రియను ఈ నెల 20వ తేదిలోగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ రైస్ మిల్లర్లకు సూచించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పౌర సరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో జేసీ సోమవారం సీఎంఆర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతుల నుండి 1లక్ష 39 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించి మిల్లర్లకు అందజేయడం జరిగిందన్నారు. అయితే 1లక్ష 34 వేల మెట్రిక్ టన్నులకు మిల్లర్ల వద్ద నుండి అంగీకార రశీదులను అందజేశారన్నారు. ఇంకా 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి రశీదులు రావాల్సి ఉందన్నారు. మిల్లర్లకు అందించిన ధాన్యానికి సమాన బియ్యాన్ని అందజేయాల్సిన బాధ్యత మిల్లర్లదేనన్నారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి ఇంకా 18 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందజేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 20లోగా పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ పీ.శివరామమూర్తి, డీఎస్‌వో పీ.కోమలిపద్మ, రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులు, మిల్లర్లు, బఫర్ గోడౌన్స్ మేనేజర్లు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం

154 కేంద్రాల ద్వారా 27,171 విద్యార్థులు హాజరు : కలెక్టర్ డిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో పదవ తరగతి పరీక్షలు అత్యంత కట్టుదిట్టంగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహిస్తున్నామని, జిల్లాలో ఏర్పాటు చేసిన 154 కేంద్రాల్లో పరీక్ష 27,171 మంది విద్యార్థులు హాజరయిన్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా సోమవారం కలెక్టర్ స్థానిక కర్నాటీ రామమోహన్‌రావు, చుండూరి వెంకటరత్నం నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 27,442 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 271 మంది విద్యార్థులు గైరహాజరు కాగా 99 శాతం హాజరు నమోదు అయిన్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఐదు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, పరీక్ష కేంద్రాలకు 1,354 ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షల కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు, 100 మీటర్ల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేసి ఆయా పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తుని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో తమ్ముడి హతం

విశాలాంధ్ర-వత్సవాయి: కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల నేపథ్యంలో తమ్ముడిని కడతేర్చిన సంఘటన మండలంలోని మంగొల్లులో చోటుచేసుకుంది. ఎస్ఐ అభిమన్యు సమాచారం మేరకు గ్రామానికి చెందిన మన్నే రాంబాబు అతని సోదరుడైన మన్నే చంటి(36)కి కొన్ని రోజులుగా కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాల విషయంలో తరచూ గొడవలు జరుగుతుండడంతో సోమవారం రాంబాబు తన సోదరుడైన చంటిపై దాడి చేశాడు. ఆ దాడిని అడ్డుకోవడానికి చంటి భార్య, తల్లి ఇద్దరు అడ్డుపడగా వారిపై దాడిచేసి, తమ్ముడి హతమార్చాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లుగా స్థానిక ఎస్ఐ అభిమన్యు తెలిపారు.

మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావు మృతి

విశాలాంధ్ర-తిరువూరు: ఏపీ మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావు (84) సోమవారం సాయంత్రం తిరువూరు లోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. తిరువూరు సర్పంచ్‌గా, విజయవాడ, గుంటూరు, తెనాలి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఉడా) చైర్మన్ గా, నడిం తిరువూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా, కృష్ణా జిల్లా మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ గా, ఇఫ్కో డైరెక్టర్ గా, రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ గా ఆయన సేవలందించారు. గత సంవత్సరం కంచి సతీమణి కనకారత్నం మృతి చెందారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కంచి రామారావు మృతికి ఎమ్మెల్యే కే రక్షణ నిధి పట్టణంలోని పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్ఎస్ సీ బోర్డ్ ఉద్యోగి మృతి

విశాలాంధ్ర- విజయవాడ (క్రైమ్): రోడ్డు ప్రమాదంలో ఎస్ఎస్ సీ బోర్డ్ ఉద్యోగి మృతి చెందింది. సోమవారం ఈ ఘటన భవానిపురం పోలీస్ స్టేషన్ పరిధి లో చోటుచేసుకుంది. గొల్లపూడి కి చెందిన రత్నకుమారి ఆమె భర్త శ్రీనివాసరావు ఎస్ఎస్ సీ బోర్డ్ లో సబ్ ఆడిడెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు. పదవ తరగతి పరీక్ష రాస్తున్న తమ పిల్లలను తీసుకురావడానికి భార్య భర్తలు తమ బైక్ పై వెళ్తున్న సమయంలో వెంకటేశ్వర ఫౌండ్రి నుండి స్వాతి పై వస్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రత్నకుమారి అక్కడిక్కడే మృతి చెందింది. భర్త ప్రమాదం నుండి బయటపడ్డాడు. ఘటన స్థలానికి భవానిపురం పోలీసులు చేరుకుని ప్రమాద జరిగిన తీరు ను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

(Notice under Order 21 Rule 35 C.P.C.)

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT JAGGAIAHPETA.

E.P.No.15 of 2022 in O.S.No.81 of 2009

Between:-

Nomula Mallikarjuna Rao - D.Hr.

And

Danthala Koteswara Rao & another - J.Drs

1st J.Dr :-

Sri Danthala Koteswara Rao son of late Veeraiah, Door No. 10-68, Karkana Bazar, Jaggaiahpeta - 521175, N.T.R. District

Whereas the above named D.Hr has made application to this Court for execution of decree in **O.S.No.81 of 2009.** Take notice and appear before this Court in person or by a pleader duly instructed by you on the **10 -04-2023 at 10-30 A.M.** and filed your objections and failed to attend before this Court and set-ex-parte and decide the matter in your absence.

Hearing Date ::10th April, 2023

// By order of Court//

Sri B.Venkataramaiah, Advocate
Jaggaiahpeta-521175
cell : 9848458095

pnb Housing Finance Limited
Ghar Ki Baat

అనుబంధం-4-ఎ
స్థిర ఆస్తి(లు) యొక్క ఇ-వేలం బహిరంగ అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)తో చదివే సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 కింద స్థిర ఆస్తుల విక్రయం కొరకు ఇ-వేలం-అమ్మకం ప్రకటన

రిజిస్టర్డ్ ఆఫీస్: - 9 వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ - 110001, ఫోను: -011-23357171, 23357172, 23705414, వెబ్: - www.pnbhousing.com
పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్. డోర్ నం.39-3-1, 2వ అంతస్తు, అంజనేయ జ్యూవెల్లర్స్ పైన ఎంజి రోడ్డు, విజయవాడ-520010

ఎం/ఎస్ పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (పీఎన్‌బీ హెచ్ఎఫ్ఎల్)/సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి ద్వారా నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనతలోకి తీసుకోబడిన (కాలమ్ నం.సిలో పేర్కొన్నవిధంగా), సెక్యూరిటీ క్రెడిటార్‌కు తాకట్టు/అధీనం చేయబడిన కాలమ్ నం.డిలో వివరించినటువంటి స్థిర ఆస్తి(లు) "ఎక్కడ ఉన్నది అక్కడ, ఏదైతే అది మరియు ఎక్కడ ఉన్నది ఉన్నట్లు ప్రాతిపదికపై" కింద తెలిపిన వివరాల ప్రకారం విక్రయించబడునని ప్రత్యేకించి కాలమ్-ఎలో సూచించబడిన రుణగ్రహీత(లు) & హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయడమైనది. ఇప్పటివరకు సవరించినట్లుగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలు, 2002 యొక్క నిబంధన-8(6)&9 కింద కాలమ్ నం.ఎలో సూచించిన సంబంధిత రుణగ్రహీతలు/తనఖాదారు(లు) (చనిపోయినప్పటి నుంచి) యొక్క చట్టబద్ధవారసులు, న్యాయ ప్రతినిధి, (తెలిసినా లేదా తెలియకపోయినా), కార్యనిర్వాహకుడు(లు), నిర్వాహకుడు(లు), వారసుడు(లు), అసైనీ(లు), రుణగ్రహీత(లు), తనఖాదారు(లు)కు నోటీసు ఇవ్వడమైనది. అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి ఎం/ఎస్. పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (పీఎన్‌బీహెచ్ఎఫ్ఎల్), సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా www.pnbhousing.com లో అందించిన లింక్‌ను చూడండి.

వ. సం.	లోన్ నం, రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/హామీదారు(లు)/ చట్టబద్ధవారసుల పేరు (ఎ)	డిమాండ్ చేసిన మొత్తం & తేదీ (బి)	స్వాధీనత స్వభావం (సి)	తనఖాపెట్టిన ఆస్తుల వివరణ (డి)	రిజర్వు ధర (ఆర్‌పి) (ఇ)	ఇఎండి (ఆర్‌పిలో 10%) (ఎఫ్)	బిడ్ సమర్పణకు చివరి తేదీ (జి)	బిడ్ పెంపుదల రేటు (హెచ్)	తనిఖీ తేదీ & సమయం (ఐ)	వేలం తేదీ & సమయం (జె)	తెలిసిన రుణభారాలు/కోర్టు కేసు ఏదైనా (కె)
1.	HOU/GNTR/0319/ 671604 "శ్రీ గిరి నాగేశ్వరరావు మాజేటి, ఎం/ఎస్. బాలా త్రిపురసుందరి జనరల్ ట్రేడర్స్/శ్రీమతి మాజేటి లక్ష్మీనరసమ్మ,	రూ. 85,32,688.48 తేదీ: 08-04-2021	నిర్మాణ ప్రాయ స్వాధీనత	"సర్వే నం. 172/3ఎ & 172/2బి, డోర్ నం : 7-17-124/1, అసెస్‌మెంట్ నం : 10748, గుంటూరు గ్రామం, గుంటూరు శ్రీనగర్, 3వ లైన్, గుంటూరు సిటీ/గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు జిల్లా లో ఇంటి ఆస్తి అయినట్లయితే ప్లింత్/నిర్మిత ప్రదేశం సహా 200 చదరపు గజాల స్థలం & దాబా ఇల్లు విస్తీర్ణం/ప్రదేశం హద్దులు : తూర్పు : 4' వెడల్పు ఉమ్మడి దారి-44'3 1/2" దక్షిణం : మల్లెబోయిన సాంబయ్య స్థలం - 41'4" పడమర : భాస్కరరావుకు చెందిన స్థలం - 44'3 1/2" ఉత్తరం : 9' వెడల్పు దారి-40"	రూ. 31,31,000/-	రూ. 3,13,100/-	తేదీ:05/05/ 2023 సమయం: ఉ.10.00 గం. నుంచి సా.5.30 గం.	30 వేల రూపాయలు	తేదీ: 29-04-2023 సమయం: ఉ.10.00 గం. నుంచి సా.5.30 గం.లు	08-05-2023 ఉ.11.00 గం. నుండి మ.2.30 గం.లు	నిల్
2.	HOU/GNTR/0319/ 671604 "శ్రీ గిరి నాగేశ్వరరావు మాజేటి, ఎం/ఎస్. బాలా త్రిపురసుందరి జనరల్ ట్రేడర్స్/శ్రీమతి మాజేటి లక్ష్మీనరసమ్మ,	రూ. 85,32,688.48 తేదీ: 08-04-2021	నిర్మాణ ప్రాయ స్వాధీనత	"సర్వే నం. 172/3ఎ & 172/2బి, డోర్ నం : 7-17-124/1, అసెస్‌మెంట్ నం : 10748, గుంటూరు గ్రామం, గుంటూరు శ్రీనగర్, 3వ లైన్, గుంటూరు సిటీ/గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు జిల్లా లో ఇంటి ఆస్తి అయినట్లయితే ప్లింత్/నిర్మిత ప్రదేశం సహా 200 చదరపు గజాల స్థలం & దాబా ఇల్లు విస్తీర్ణం/ప్రదేశం హద్దులు : తూర్పు : 4' వెడల్పు ఉమ్మడి దారి-44'3 1/2" దక్షిణం : మల్లెబోయిన సాంబయ్య స్థలం - 41'4" పడమర : భాస్కరరావుకు చెందిన స్థలం - 44'3 1/2" ఉత్తరం : 9' వెడల్పు దారి-40"	రూ. 78,14,000	రూ. 7,81,400/-	తేదీ:05/05/ 2023 సమయం: ఉ.10.00 గం. నుంచి సా.5.30 గం.	50 వేల రూపాయలు	తేదీ: 29-04-2023 సమయం: ఉ.10.00 గం. నుంచిసా.5.30 గం.లు	08-05-2023 ఉ.11.00 గం. నుండి మ.2.30 గం.లు	నిల్
3	HOU/VJWD/0718/ 559283 గొరు శ్రీనివాసరావు "స్వాతి ఎలక్ట్రికల్స్, మేరుగు స్వాతి"	రూ. 32,89,357.17 తేదీ: 21-03-2022	భౌతిక స్వాధీనత	కృష్ణా జిల్లా, గుణదల, విజయవాడ తూర్పు జిల్లా రిజిస్ట్రార్, ప్రసాదంపాడు గ్రామ పంచాయతీ ఏరియా, ప్రసాదంపాడు గ్రామంలో ఉన్న ఆర్.ఎస్.నం.69/6 లో 300 చదరపు గజాల మొత్తం విస్తీర్ణం నుంచి 37.5 చదరపు గజాల అవిభాజ్య ఉమ్మడి విస్తీర్ణంతో కలిపి 1001.0 చదరపు అడుగుల నిర్మిత ప్రదేశంతో "జాన్సీ హైట్స్" యొక్క మొదటి అంతస్తులో ఫ్లాట్ నం.ఎఫ్2 యొక్క ఆస్తి" హద్దులు - భూమి హద్దులు: తూర్పు: వేములపల్లి కిషోర్‌బాబు ఆస్తి, దక్షిణ: 15.0 అడుల వెడల్పు పంచాయతీ రోడ్డు, పడమర: వణుకూరి జాన్సీ లక్ష్మి ఆస్తి, ఉత్తరం: వల్లభనేని రాజేశ్వరి ఆస్తి. ఫ్లాట్ హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నం. ఎఫ్-1 మధ్య ఉమ్మడి గోడ, ఉత్తరం: ఓపెన్ టు స్కై	రూ. 31,31,000/-	రూ. 3,13,100/-	తేదీ:05/05/ 2023 సమయం: ఉ.10.00 గం. నుంచి సా.5.30 గం.	30 వేల రూపాయలు	తేదీ: 29-04-2023 సమయం: ఉ.10.00 గం. నుంచి సా.5.30 గం.లు	08-05-2023 ఉ.11.00 గం. నుండి మ.2.30 గం.లు	నిల్
4	HOU/VJWD/0719/ 727457 శ్రీ దండు సతీష్, దండు శ్రావణి, దండు నర్సింగ్‌రావు	రూ. 67,00,365.33 తేదీ: 03-06-2021	భౌతిక స్వాధీనత	ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, పెద కాకాని మండలం, అగతవరపాడు పెద్ద సర్వే నం.18(ఎ)(పి 18(బి)(పి) 19(పి)లో ప్లాట్ నం.11 12 13పై 1000 చదరపు అడుగుల (ఉమ్మడి ప్రదేశం మరియు కారుపార్కింగ్ సహా) కలిగిన యూనివంటి సింబ్లిస్ వాలెగ్ అంతస్తులో ఫ్లాట్ నం.510 మొత్తంగా. సరిహద్దులు : పొరుగు వారి భూమి మరియు ప్లాట్ నం.14, తూర్పు : 40.0 వెడల్పు రోడ్డు, దక్షిణం : ప్లాట్ నం.10, లంక రియన్, పడమర : పొరుగువారి భూమి. వాలెగ్ అంతస్తు, ఫ్లాట్ నం.510 హద్దులు : ఉత్తరం : ప్లాట్ నం.509 మరియు ఓపెన్ టు స్కై దక్షిణం : ఫ్లాట్ నం.511 ఓపెన్ టు స్కై, తూర్పు : ఓపెన్ టు స్కై పడమర : కారిడార్.	రూ. 31,31,000/-	రూ. 3,13,100/-	తేదీ:05/05/ 2023 సమయం: ఉ.10.00 గం. నుంచి సా.5.30 గం.	30 వేల రూపాయలు	తేదీ: 29-04-2023 సమయం: ఉ.10.00 గం. నుంచి సా.5.30 గం.లు	08-05-2023 ఉ.11.00 గం. నుండి మ.2.30 గం.లు	నిల్

* వర్తించినట్లుగా 18% వార్షిక రేటుతో భవిష్యత్తు వడ్డీ, చెల్లింపు తేదీ మరియు/లేదా వసూల్పయ్యే తేదీ వరకు భరించిన యాదృచ్ఛిక ఖర్చులు, వ్యయం, చార్జీలు మొదలైనవి. ** పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ఉత్తమ జ్ఞానం మరియు సమాచారం మేరకు పైన పేర్కొన్న స్థిర/హామీగా పెట్టిన ఆస్తిపై కాలం 'కె' లో వెల్లడించినవి మినహా ఎటువంటి రుణభారాలు/క్లెయిములు లేవు. అటువంటి రుణభారాలు చివరిలో విజయవంతమైన కొనుగోలుదారు / బిడ్డర్ అతను/ఆమె చెల్లించవలెను. [illegible] 1. కాలం నం.'కె'లో పేర్కొన్నట్లు ఈ తేదీ నాటికి పైన పేర్కొన్న స్థిర ఆస్తులు/హామీగా పెట్టిన ఆస్తుల అమ్మకం, [illegible] 2. [illegible] 3. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(3) ప్రకారం, బిడ్డర్(లు)/కొనుగోలుదారు విక్రయ ధరలో 25% మొత్తాన్ని [illegible] సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(2) ప్రకారం విక్రయ ధరలో 25% చెల్లింపు [illegible] మిగిలిన 75% మొత్తాన్ని [illegible] 15 రోజులలోపు డిపాజిట్ చేయాలి. [illegible] 4. ఇ-వేలం/బహిరంగ వేలం విక్రయం ద్వారా అమ్మకం నిర్వహించడంలో అధీకృత అధికారికి సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహాయం చేస్తుంది. [illegible] మీరు పీఎన్‌బీహెచ్ఎఫ్ఎల్ అధీకృత అధికారి/వ్యక్తి కోటేశ్వరరావు ఉప్పాల మొబైల్ నెం:8099924422 లేదా www.pnbhousing.com వెబ్‌సైట్‌ను చూడండి.

తేదీ: 04.04.2023, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, ఎం/ఎస్. పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

స్వయం సహాయక సంఘ సభ్యుల సహకారం మరువలేనిది

జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : దేశం కోసం అహర్నిసలు సేవలు అందింస్తూ విధి నిర్వహణలో అటుపోట్లను ఎదుర్కొంటున్న సైనికుల సంక్షేమ నిధికి స్వయం సహాయక బృందాల సభ్యులు విరాళాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని, వారిని స్ఫూర్తిగా తీసుకుని సైనిక సంక్షేమ నిధికి విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు కోరారు. స్వయం సహాయక బృందాల సభ్యులు విరాళాల చెక్‌ను స్థానిక కలెక్టర్ కార్యాలయం జిల్లా సమాఖ్య సభ్యులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణకు ప్రాణాలను అర్పించి అమర వీరులైన సైనిక కుటుంబాలను ఆదుకోవాల్సిన భాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వయం సహాయక బృందాలు మహిళల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం అందించిన సహకారాన్ని వినియోగించుకుంటూ సంపాధించిన దానిలో కొంత సంక్షేమ నిధికి విరాళంగా అందించేందుకు స్వచ్ఛందగా ముందుకు వచ్చినందుకు స్వయం సహాయక బృందాలను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 25,097 స్వయం సహాయక సంఘాల జిల్లా సమాఖ్య సభ్యులు రూ.7లక్షల 62 వేల 892 సాయుద దళాల పతాక నిధికి విరాళ చెక్కును అందించిన వారి దాతృత్వాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశ రక్షణ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు భారత జవానుల ధైర్యసహసాలు తెగువకు జాతి యావత్తు గర్విస్తుందన్నారు. ఆయా సమయాల్లో ఎంతో మంది జవానులు వీరమరణం పొందరన్నారు. దేశంలో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే అందుకు సైనికుల రక్షణే కారణమని, దేశ రక్షణలో పాటు పడుతున్న ప్రతి సైనికునికి ఎంతో రుణపడి ఉన్నామన్నారు. వీర మరణం చెందిన సైనికుల తల్లిదండ్రులు, భార్య, పిల్లలకు ఎవరికి తోచిన రీతిలో వారు విరాళాలు అందించడం ద్వారా కొంత మేరకు లోటు తీర్చగలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చేవారు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ జిల్లా సైనిక సంక్షేమ అధికారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఖాతా 62067742138 ఐఎఫ్ఎస్సి కోడ్ ఎస్‌బీఐఎన్ 0020899 ద్వారా నేరుగా విరాళాలు అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాస్, డీపీఎం ఎం.సునీతలక్ష్మి, జిల్లా సమాఖ్య అధ్యక్షులు కే.సీత, కార్యదర్శి కే.రాణి, కోశాధికారి పీజీ లియోనా పాల్గొన్నారు.

ఆర్జీదారుల సమస్యలకు స్పందనే ఎకైక పరిష్కార మార్గం

స్పందనలో ప్రజలు సమర్పించిన ఆర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించారు. సమస్యలను ఓపికతో వింటూ వర్చువల్ విధానం ద్వారా సంబంధిత అధికారులతో ప్రత్యక్షంగా సమస్యపై చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించడం పలువురు ఆర్జీదారులను ఆకట్టుకుంది. ఆర్జీదారుడు స్థానిక కార్యాలయ అధికారుల చుట్టూ అనేక మార్లు తిరిగినప్పటికి పరిష్కారం కాని సమస్య కలెక్టర్ చొరవతో అక్కడిక్కడే పరిష్కారం లభించడం ఆనందానికి గురి చేసింది. సమస్యకు పరిష్కారం లభించడంతో ఆర్జీదారులు స్పందన అనంతరం సంతోషంగా చర్చించుకోవడం విశేషం. తమ సమస్యలకు స్పందనే సరైన మార్గమని ఓర్పు, సహనం, ప్రజల పట్ల ఆధరాభిమానాలు కలిగిన డిల్లీరావు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా ఉండటం తమ అదృష్టమని ఆర్జీదారులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ స్పందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి స్పందన ఎకైక మార్గమని ఆర్జీదారులు ఆశతో స్పందనలో ఆర్జీలను అందజేస్తున్నారన్నారు. వాటిని నిశితంగా పరిశీలించి పరిష్కరించాల్సిన భాధ్యత మనపై ఉందన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యకు సరైన పరిష్కారం చూపగలిగిన్నప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. సమస్యను పరిష్కరించాలనే ఆలోచన పట్టుదలను అచరణలో పెడితే పరిష్కార మార్గాలు లభిస్తాయని, ఈ దశగా ప్రతి అధికారి తమ భాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.నుపూర్ అజయ్, ఆర్‌డీవో కే.మోహన్‌కుమార్, డీపీవో జే.సునీత, డిప్యూటి కలెక్టర్లు రామలక్ష్మి, భాను, అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సంతృప్తే లక్ష్యం, సమస్యలకు పరిష్కారం చూపాలి

అర్జీదారుల సంతృప్తే లక్ష్యం, సమస్యలకు పరిష్కారం చూపాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మేయర్, కమీషనర్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జిలను స్వీకరించారు. ఆయా అర్జీదారుల సమస్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీనీ నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అర్జీదారుని సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నగర పాలక సంస్థ కల్పిస్తున్న మౌలిక సదుపాయాల్లో వారు ఎదుర్కోంటున్న ఇబ్బందుల పట్ల స్పందించి అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమంలో ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగం-4, పట్టణ ప్రణాళిక విభాగం-6, పబ్లిక్ హెల్త్ విభాగం-2, రెవిన్యూ-1, యూసీడీ పీవో-1 విభాగాలకు సంబందించిన అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్‌లు ఎం.శ్యామల, కేవీ.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ డీ.వెంకటలక్ష్మి, యూసీడీ పీవో శకుంతల, అమృత్ పథకం జేడీ డాక్టర్ కేబీఎస్ఎస్ లతా, సెక్రటరీ కే.వసంతలక్ష్మి, ఏడీహెచ్ శ్రీనివాసు, ఎస్టేట్ ఆఫీసర్ కే.అంబేద్కర్, మేనేజర్ బీ.శ్రీనివాస్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

అంకమ్మ, రమణమ్మల తిరునాళ్లు ప్రారంభం

విశాలాంధ్ర-వీరులపాడు: ఆరు రోజులు నిర్వహించే అంకమ్మ ,రమణమ్మ తల్లుల తిరునాళ్లు ఆదివారం నుండి వీరులపాడు మండలం జయంతి గ్రామంలో ప్రారంభమయ్యాయి. గుడి నుండి బయటకు తీసిన ఉత్సవ విగ్రహాలను మునుసూబు ఇంటి నందు ఒకరోజు, మరుసటి రోజు గ్రామపంచాయతీ నందు నిద్ర చేస్తూ గురువారం రోజుకు అంకమ్మ ,రమణమ్మ తల్లుల దేవాలయం కు చేరుకొంటాయి. గురువారం రోజున ఉదయం మహిళలు బోనాలతో ఊరంతా తిరిగి దేవాలయంకు చేరుకుంటారు.అదే రోజు సాయంత్రం సిరుమాను కార్యక్రమంతో ముగిస్తారు. ఈ ఆచారాన్ని గ్రామ ప్రజలు ప్రతి ఏటా నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో తిరుణాలను నిర్వహిస్తారు.

ఆశీల టెండర్లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : గత నెల24 వ తేదీన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారస్తుల నుండి డబ్బులు వసూలు చేసుకునేందుకు నిర్వహించిన ఆశీలు టెండర్ ను రద్దు చేయాలని స్పందన లో ఇచ్చిన అర్జీ పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సోమవారం సబ్ కలెక్టర్ అదితి సింగ్ ను కలసి కోరడం జరిగింధని మున్సిపాలిటీ కౌన్సిలర్ సి హెచ్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ టెండర్ విషయంలో టిడిపి కౌన్సిలర్లకు కనీస సమాచారం లేకుండా ప్రజల నుండి అభ్యంతరాలు స్వీకరించకుండా కొండపల్లి మున్సిపల్ చైర్మన్ బహిరంగ వేలం ను అత్యంత గోప్యంగా నిర్వహించిన తీరును సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో త్రాగునీరు సమస్య అధికంగా ఉందని, ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే వచ్చే వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొనవలసి ఉంటుందని కూడా కలెక్టర్ కు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మరియు కౌన్సిలర్స్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, చనుమోలు నారాయణ, రావి ఫణి , మైల సైదులు,ధరణికోట విజయలక్ష్మి, చుట్టుకుదురు వాసు తదితరులు పాల్గొనడం జరిగినది.

బందోబస్తు పరిశీలించిన ఏసీపీ రమేష్

విశాలాంధ్ర-తిరువూరు: తిరువూరు పట్టణంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న పలు పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను మైలవరం ఏసీపీ ఎం రమేష్ సోమవారం పరిశీలించారు. విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ క్రాంతి రానా టాటా ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు రూరల్ డిసిపి శ్రీమతి మేరీ పర్యవేక్షణలో పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. తిరువూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ భీమరాజు తో కలిసి సర్కిల్ పరిధిలో పది పరీక్షలు జరుగుతున్న 17 సెంటర్లని చేసి ఏసీపీ ఆకస్మికంగా తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణలో మాస్ కాపీయింగ్ కి తావులేకుండా భద్రత కట్టుదిట్టం చేయాలని సర్కిల్ పరిధిలోని ఎస్ఐలను ఆదేశించారు.

అనంత వైద్య విధాన పరిషత్‌లో జరిగిన అక్రమాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన సీపీఅర్

-వైద్య విధాన పరిషత్ లో జరిగిన అక్రమాలపై గవర్నర్ కు నివేదిక పంపిన సీసీఆర్

విశాలాంధ్ర-విజయవాడ : అనంతపురం జిల్లా వైద్య విధాన పరిషత్‌లో పౌర మానవ హక్కుల సంస్థ అనుబంధ సంస్థ కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ (సీసీఆర్) గత 6 నెలలుగా ఆసుపత్రుల రికార్డుల తనిఖీలు జరిపి, సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సర్వేలు, విచారణలు ద్వారా వెలుగులోకి వచ్చిన అవినీతి,అక్రమాలు,నిధుల దుర్వినియోగం కు సంబంధించిన ఆధారాలతో సహా 200 పేజీల పూర్తి నివేదిక వివరాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌కు, రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య కార్యదర్శికి పంపడం జరిగిందని "ఇది సీసీఆర్ చరిత్రలో ఓ మైలు రాయి"అని సీసీఆర్ ప్రతినిధి జి. శ్రీనివాసరావు తెలిపారు. సీసీఆర్ ప్రతినిధులు గార్లపాటి శ్రీనివాస రావు (గుంటూరు), గొట్టిముక్కల శిరీష్ బాబు(తిరుపతి జిల్లా), బి కోటినాగయ్య(బాపట్ల జిల్లా), వెంకట రాఘవ (విజయవాడ) ఆధ్వర్యంలో సోమవారం రాజ్ భవన్ నందు 200 పేజీలు నివేదిక వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ సీసీఆర్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిపిన విచారణలు సర్వేలు, ఆర్టీఐ తనిఖీలు ద్వారా పదిహేను అంశాలు కు సంబంధించిన అవినీతి అక్రమాలు బహిర్గతం అయ్యాయని చెప్పారు. వాటిలో సాక్షాత్తూ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి తప్పుడు పదోన్నతి పొందడం.ఆదర్శంగా ఉండాల్సిన జిల్లా కార్యాలయం లో ఆర్టీఐ చట్టాన్ని పలుమార్లు ఉల్లంఘించడం. రాష్ట్ర ప్రభుత్వం నియమాలకు విరుద్ధంగా అక్రమ వర్క్ ఆర్డర్స్ పేరుతో డిప్యూటేషన్స్ వేయడం. దళారీ వ్యవస్థను ఓ ఉద్యోగి ప్రోత్సహించడం, అయిదు నెలల క్రితం రాజీనామా చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుకు జీతాలు వేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయడం, ఎన్నికల కోడ్ అమలు లో వుండగా ప్రజా ప్రతినిధుల సిఫార్సు స్వీకరించి రెండు సార్లు ఎన్నికల కోడ్ ఉల్లంఘించడం, ఆరు నెలలుగా ఒకే ఉద్యోగి కి రెండు చోట్ల జీతం పెట్టడం, ఆర్థిక నేరాలకు ప్రయత్నించడం, గతంలో జరిగిన అక్రమాలకు విచారణ చేయమని జిల్లా కలెక్టర్ ఆదేశాలు పంపితే రెండు సంవత్సరాల కాలంగా విచారణ చేయకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉల్లంఘించడం,డీసీహెచ్ఎస్ కార్యాలయంలో వర్క్ ఆర్డర్స్‌కు, విచారణలకు , ఇతర ఆర్డర్స్‌కు ఎటువంటి నోటు ఫైల్ వివరాలు చాలా వరకు లేకపోవడం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను తప్పుదోవ పట్టించి అక్రమ బదిలీ చేయడం, విధులకు హాజరు కాకుండా రేపటి హాజరు సంతకాలు ఈ రోజే చేయడం, ఆసుపత్రి కి సంబంధించిన ముఖ్య రికార్డులు నిర్వహించకపోవడం, లిఖితపూర్వకంగా రాసివ్వడం, ఆసుపత్రి అభివృద్ధి నిధుల దుర్వినియోగం చేయడం, అవి బయటకు రాకుండా వుండటం కోసం ఆర్టీఐ చట్టాన్ని నిర్వీర్యం చేయడం, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి వాహనం తెలుపు బోర్డ్‌ను పసుపు బోర్డ్ గా మార్చి మోటార్ వెహికల్ చట్టం ను ఉల్లంఘించడం పై అనుమానాలు వ్యక్తం అవడం, అక్రమాలు బయటకు రాకుండా భూటకపు విచారణలు చేయించటం, మా కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి వుండడని ఆర్టీఐను తిరస్కరిస్తే వారిపై నేటి వరకు చర్యలు తీసుకోకుండా జిల్లా అధికారే విధులలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వంటి అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆధారాలతో సహా కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ సంస్థ సేకరించిందని చెప్పారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ సంస్థ ప్రెసిడెంట్ అయిన మంచికట్ల.అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యం కోసం వేల కోట్ల రూపాయలు మంజూరు చేస్తుంటే కొంత మంది అవినీతి పరుల వలన ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతూ అవినీతి చెలరేగిపోవటం బాధాకరం అన్నారు. అదేవిధంగా ప్రశ్నించాల్సిన అవసరం ప్రతి పౌరుడికి వుంటుందన్నారు. 8 నెలలలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. ఆరు నెలలగా జిల్లాలో జరిగిన తనిఖీలు, విచారణ సర్వేలు లలో సంస్థ జిల్లా కార్యదర్శి సల్మాన్ రాజు , కోఆర్డినేటర్ మహేష్ , జిల్లా ప్రతినిధులు ఉలిగన్న కిరణ్, పరశురామ్ ,అశోక్ కుమార్, నాగరాజు, తదితర సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. . పూర్తి సహకారం అందించిన సీసీఅర్ సంస్థ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి బత్తిన శ్రీనివాస్‌రావు, జాయింట్ సెక్రటరీ చిత్రా రాజేష్, గుత్తి త్యాగరాజు , గుంటూరు జిల్లా కార్యదర్శి వేంకటేశ్వరులు ,ముఖ్య ప్రతినిధులు బి.చరణ్ కాంత్, తదితరులు,సభ్యులకు అభినందనలు తెలిపారు.రెండవ విడుత తనిఖీ, సర్వేలలో ,రాయదుర్గం ఏరియా ఆసుపత్రి ,తాడిపత్రి ఏరియా ఆసుపత్రి, ధర్మవరం, మడకశిర, హిందూపూర్,సి.డి ఆసుపత్రుల లో నిర్వహించనున్నట్లు అధికారికంగా తెలిపారు. తాము అందించిన నివేదికను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

చల్లపల్లిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుచేయాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : ప్రతి మండలానికి 108, 104 కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం కనీసం మూడు మండలాలకు ఒక ఫైర్ స్టేషన్ను తక్షణమే ఏర్పాటుచేయాలంటూ జనసేన నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చల్లపల్లిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుచేస్తామని అవనిగడ్డ సభలో ముఖ్యమంత్రి ఇచ్చిన మాటీ అమలుచేయాలని కోరారు. ఫైరేషన్ ఏర్పాటు కోరుతూ సోమవారం జనసేన నాయకులు, కార్యకర్తలు చల్లపల్లిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ కె.గోపాలకృష్ణకు వినతిపత్రం అందించారు. చల్లపల్లిలో ఫైరేషన్ ఏర్పాటు అంశం దశాబ్దాల కలగా ఉందనీ, అగ్నిప్రమాదాల సమయంలో ప్రమాద నష్టం తగ్గించేందుకు, ప్రజల ప్రాణాలు, ఆస్థులు కాపాడేందుకు చల్లపల్లిలో ఫైరేషన్ ఏర్పాటు ఎంతో అవసరం అని నేతలు పేర్కొన్నారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, ఆరుమండలాల జనసేన అధ్యక్షులు చోడగం విమలకృష్ణ, గుడివాక శేషుబాబు, పూషడపు రత్నగోపాల్, కోన రాజశేఖర్, మర్రె గంగయ్య, చింతా వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు ఉస్మాన్ షరీఫ్, బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, నూకల లక్ష్మయ్య, బొందలపాటి వీరబాబు, పసుపులేటి రవికుమార్, సోమిశెట్టి రాఘవేంద్రరావు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర - చల్లపల్లి: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చల్లపల్లి గురుకుల పాఠశాల, ఎస్సార్వైఎస్పీ హైస్కూల్, విజయ పబ్లిక్స్కూల్, రామానగరం శ్రీచైతన్య పాఠశాల, మాజేరు జడ్పీ హైస్కూల్లో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా, తొలిరోజు తెలుగు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అక్రమ ఇసుక రవాణాని అరికట్టాలి : తాతయ్య

విశాలాంధ్ర-వత్సవాయి: యదేచ్ఛగా ఆంధ్రా నుండి తెలంగాణకు మండల కేంద్రమైన వత్సవాయి లోని రాష్ట్ర సరిహద్దు మీదుగా అక్రమ ఇసుక రవాణా యదేచ్ఛగా సాగుతున్నప్పటికీ కూడా అధికారులు ఏ ఒక్కరు కూడా మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని జగ్గయ్యపేట మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య ఎద్దేవా చేశారు.... సోమవారం నాడు వత్సవాయి రాష్ట్ర సరిహద్దు వద్ద తెదేపా పార్టీ కార్యకర్తలు నాయకులతో రోడ్డుపై బైఠాయించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి నానా ఇబ్బందులు పడుతూ ఒక ట్రక్కు ఇసుక తోలుకోవడానికి 5000 రూపాయలు వెచ్చించాల్సిన కర్మ దాపరించిందని దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని, తెలుగుదేశం పార్టీ హయాంలో పేదలకు ఉచితంగా ఇసుక అందించిన ఘనత తెదేపా పార్టీకి మాత్రమే చెందుతుందనిఅన్నారు... పట్టపగలు అడ్డగోలుగా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ ఏ అధికారి కూడా స్పందించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ దోపిడీతనానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.. ఇప్పటికైనా అక్రమ ఇసుక రవాణా ఆగకపోయినట్లయితే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.. ఈ బైఠాయింపులో తెదేపా పార్టీ ప్రముఖ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

ఉపాధి హామీ పనులను ప్రారంభం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లో భాగంగా 2013-2014 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న పెనుగంచిప్రోలు మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి.ఉప సర్పంచ్ బాడిశ పాపారావు. మహిళ సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ. ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.. అలాగే అనిగండ్ల పాడు గ్రామ సర్పంచ్ బి. జ్యోతి బ్రాంహం. ఎంపిటిసి పొందూరు విజయలక్ష్మి. వార్డు మెంబర్ పసుపు లేటి. రాధ. పీల్డు అసి స్టెంట్ రమణ. ఉపాధి హామీ పనులను ప్రాంభించారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

విశా లాంధ్ర-పెనుగంచిప్రోలు : మండల కేంద్రం అయిన పెనుగంచిప్రోలు గ్రామంలో ఆదివారం లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షలకు సిద్ధపడిన విద్యార్థిని విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పౌచులు అందించడం జరిగింది. ము ఖ్య అ ది లుగా ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత స్థితికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులకు నిజమైన సంతోషం కలుగుతుందని తెలియజేశారు. విద్యార్థులు చెడు మార్గాలను పట్టకుండా మంచిగా చదువుకొని కుటుంబానికి సమాజానికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. ఈ సందర్భంగా మండల పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగకరమైన సేవా కార్యక్రమాలు చేసి విద్యార్థులను, ప్రజలను ప్రోత్సహిస్తున్నందుకు లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులైన శ్రీనివాసరావు, ప్రమీలాను అభినందించారు. అనంతరం నిర్వాహకులు ఎస్సై హరి ప్రసాద్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు, పెద్దలు పలువురు పాల్గొన్నారు.

అంగన్వాడీ 6 వ సెంటర్ లో వెల్ బేబీ షో

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండలకేంద్రం అయిన పెనుగంచిప్రోలు లోని అంగన్వాడీ 6 వ సెంటర్ నందు సోమవారం వెల్ బేబీ షో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం నందిగామ ప్రాజెక్టు అధికారిణి భాగ్య రేణుక.సూపర్ వై జ ర్.ఉషా రాణి. ఆదేశాలతో ఈ కార్యక్రమంనిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మానికి అధితులుగా గ్రామ సర్పంచ్ వేల్పుల. పద్మ కుమారి. జడ్ పి టి సి. ఊట్ల. నాగమణి. మండల స మై ఖ్య అధ్యక్షురాలు. కాకాని. పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే ఆహారం చాల పోష్టిక హారమని దీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.బాలామ్రు తం తో అంగన్వాడీ కార్యకర్తలు రకరకాల ఫుడ్స్ ఆహారం తయారు చేశారని మీ ఇంట్లో కూడ మీ పిల్లలకు ఎలాంటి ఆహారం పెట్టాలని సూ చ్చింశారు. ఈ కార్యక్రమంలోప్రభుత్వం ఆసుపత్రి డాక్టర్ ఇందిరా.అంగన్వాడీ కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు

5న సత్యాగ్రహ నిరాహార దీక్ష

- గాంధీదేశం ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ వెల్లడి

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈనెల 5వ తేదీన గాంధీనగర్ లోని ధర్నా చౌక్లో సత్యాగ్రహ నిరాహార దీక్ష చేయనున్నట్లు గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ ప్రకటించారు. సోమవారం భవానీపురం ఊర్మిళానగర్ లోని గాంధీ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గాంధీ నాగరాజన్ మాట్లాడుతూ ప్రస్తుతం బిజెపి పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని ప్రధాని మోడీ, బిజెపి పాలకులు ఎంతో అప్రజాస్వామ్యంగా తొలగించారని ఆయన విమర్శించారు. వెంటనే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని గాంధీ నాగరాజన్ డిమాండ్ చేశారు. గతంలో ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీని సైతం ఆయన తప్పు పట్టారు. ఇదే తరహాలో ప్రస్తుతం ప్రధాని మోడీ పాలనలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందని విమర్శించారు. ప్రధాని మోడీ విధానాలు అదానికి లబ్ధి చేకూర్చేలా ఉన్నాయి గాని భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రతికితే దేశం కోసం, చస్తే దేశం కోసం అనే నినాదంతో తాను ఉద్యమ బాట నడుస్తున్నానని ఆయన వివరించారు. ప్రజాస్వామ్యవాదులు రాజకీయాలకు అతీతంగా తన సత్యాగ్రహ నిరాహారదీక్షకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

పంటలకు నష్టపరిహారం అందించాలి

టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ డిమాండ్.

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి అంచనా వేసి నష్టపరిహారం అందించాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా గాలివాన బీభత్సం కారణంగా నది తీర గ్రామాల్లో 1000 హెక్టార్లో సాగుచేసిన మొక్కజొన్న అరటి తోటలో దెబ్బతిన్నాయని పేర్కొంటూ సోమవారం మండల వ్యవసాయ అధికారి శైలజ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఆరుగాల పండించిన పంట చేతికి వచ్చే సమయంలో పకృతి విపత్తుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంటలను అంచనావేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల తెలుగు రైతు అధ్యక్షుడు జొన్నలగడ్డ సురేంద్ర మరియు కొల్లిమర్ల నరసింహ స్వామి రెంటపల్లి వెంకటేశ్వరరావు కొల్లిమర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి పోషణ పక్షోత్సవాలు

విశాలాంధ్ర-నందిగామ : ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం పోషణ పక్షోత్సవాలు ఘనంగా మూసాయి, సిడిపిఓ భాగ్య రేణుక ఆధ్వర్యంలో అంగన్వాడి పరిధి లోతల్లులకు చిరుధాన్యాలు, ఆకుకూరలు వంటకాల ప్రదర్శన నిర్వహించి వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు, వెల్ బేబీ షో పోటీల్లోతల్లులకు బహుమతులు అందజేశారు, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిడిపిఓ కృష్ణకుమారి సూపర్వైజర్ కరుణ అంగనవాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 12 అర్జీలు.

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన స్పందన కార్యక్రమం ద్వారా ఎటువంటి సమస్యనైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చని ఆర్డిఓ రవీంద్రబాబు అన్నారు ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు వచ్చినట్లు కార్యాలయ అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు ఇందులో రెవిన్యూ డిపార్ట్మెంట్ కు సంబంధించి మూడు అర్జీలు రాగా, పోలీస్ డిపార్ట్మెంట్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ కు సంబంధించి చెరో ఒక అర్జీ, పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ కు సంబంధించి అత్యధికంగా ఏడు ఫిర్యాదులు వచ్చినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు స్పందన కార్యక్రమంలో అందుకున్న ఫిర్యాదులను సంబంధిత అధికారుల ద్వారా పరిశీలించ విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్డిఓ రవీంద్రబాబు ఫిర్యాదు దారులకు హామీ ఇచ్చారు స్పందన కార్యక్రమంలో ఇచ్చే ఫిర్యాదులు సంబంధిత డిపార్ట్మెంట్ కు సంబంధించినదా కాదా అని పరిశీలించుకుని అర్జుదారులు అర్జీలు అందించాలని కోరారు.

పది పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని పాఠశాలలకు కలిపి, కేంద్రమైన విస్సన్నపేటలో అధికారులు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. జడ్పీ పాఠశాల, సెయింట్‌థెరిస్సా, శ్రీశ్రీ, సిద్ధార్థ, వికాస్ పాఠశాలల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేసి, విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. తొలిరోజు జరిగిన పరీక్షలకు మొత్తం 1,044మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 1,024మంది హాజరై, 18మంది గైర్హాజరైనట్లు ఎమ్యీవో సీహెచ్.రామకృష్ణ తెలిపారు.